21-04-2021 ఉదయము మురళి ఓంశాంతి బాప్‌దాదా మధువనము

" మధురమైన పిల్లలారా - ఇప్పుడు మీరు సత్యమైన తండ్రి ద్వారా సత్య మైన విషయాలను విని వెలుగులోకి వచ్చారు కనుక అందరినీ అంధకారము నుండి ప్రకాశములోకి తీసుకురావాలి. "

ప్రశ్న:- ఎవరికైనా జ్ఞానాన్ని వినిపించునప్పుడు పిల్లలైన మీకు ఏ విషయము తప్పక స్మృతి ఉండాలి ?

జవాబు :- నోటి ద్వారా పదే పదే బాబా-బాబా అని అంటూ ఉండండి. దీని ద్వారా నేను అనునది సమాప్తమవుతుంది. ఆస్తి కూడా గుర్తు ఉంటుంది. బాబా అని చెప్పడం వలన సర్వవ్యాపి జ్ఞానము మొదటే సమాప్తమైపోతుంది. ఒకవేళ భగవంతుడు సర్వవ్యాపి అని ఎవరైనా అన్నట్లయితే తండ్రి అందరిలో ఎలా ఉండగలరని అడగండి.

పాట :- నేడు మానవుడు అంధకారములో ఉన్నాడు... (ఆజ్ అంధేరే మే హై ఇన్సాన్...)

ఓంశాంతి. పిల్లలు ఏం చెప్పారు? ఎవరిని పిలిచారు? ఓ జ్ఞాన సాగరా! లేక ఓ జ్ఞానసూర్య తండ్రీ!..... అని పిలిచారు. భగవంతుని తండ్రి అని అంటారు కదా. భగవంతుడు తండ్రి అయితే మీరంతా వారి సంతానము. మేము అంధకారములో వచ్చి పడ్డాము. మీరు మమ్ములను ప్రకాశములోకి తీసుకెళ్ళండి అని పిల్లలంటారు. బాబా అని అనడం వలన తండ్రిని పిలుస్తారని నిరూపణ అవుతుంది. బాబా అనే శబ్దము ద్వారా ప్రేమ కలుగుతుంది ఎందుకంటే తండ్రి నుండి ఆస్తి తీసుకుంటారు. కేవలము ఈశ్వరా లేక ప్రభువు అని అనుట వలన బాబా ఆస్తి అనుభవము కాదు. బాబా అని అనడం వలన వారసత్వము గుర్తుకొస్తుంది. బాబా మేము అంధకారములో వచ్చి పడ్డాము, మీరు ఇప్పుడు జ్ఞానము ద్వారా మా జ్యోతిని మళ్ళీ వెలిగించండి అని పిలుస్తారు. ఎందుకంటే ఆత్మజ్యోతి ఆరిపోయి ఉంది. మనుష్యులు మరణించినప్పుడు 12 రోజులు జ్యోతిని వెలిగిస్తారు. జ్యోతి ఆరిపోరాదని ఒకరు నెయ్యి వేసేందుకు కూర్చుని ఉంటారు.

బాబా అర్థం చేయిస్తున్నారు - భారతవాసులైన మీరు వెలుగులో అనగా పగలులో ఉండేవారు. ఇప్పుడు రాత్రిలో ఉన్నారు.12 గంటలు పగలు, 12 గంటలు రాత్రి. అది హద్దులోని విషయము. ఇది అనంతమైన పగలు, అనంతమైన రాత్రి. బహ్మ పగలు అనగా సత్య-త్రేతా యుగాలు, బ్రహ్మ రాత్రి అనగా ద్వాపర-కలియుగాలు. రాత్రిలో అంధకారము ఉంటుంది. మనుష్యులు ఎదురుదెబ్బలు తింటూ ఉంటారు. భగవంతుని వెతికేందుకు నలువైపులా తిరుగుతూ ఉంటారు. కాని పరమాత్మను పొందలేరు. పరమాత్మను పొందేందుకే భక్తి చేస్తారు. ద్వాపర యుగము నుండి భక్తి ప్రారంభమౌతుంది అనగా రావణ రాజ్యము ప్రారంభమౌతుంది. దశరా గురించి కూడా ఒక కథను తయారు చేశారు. సినిమాలు, నాటకాలు తయారు చేసినట్లే వారి మనస్సుకు నచ్చినట్లుగా కథలు తయారు చేస్తారు. శ్రీమత్ భగవద్గీత ఒక్కటే సత్యమైనది. పరమాత్మ పిల్లలకు రాజయోగాన్ని నేర్పించారు, రాజ్యాన్ని ఇచ్చారు. తర్వాత

భక్తిమార్గంలో కూర్చుని కథలు తయారు చేస్తారు. వ్యాసుడు గీతను తయారు చేశాడు అనగా కథను తయారు చేశారు. మీరిప్పుడు సత్యమైన విషయాన్ని తండ్రి ద్వారా వింటున్నారు. సదా బాబా బాబా అని చెప్తూ ఉండాలి. పరమాత్మ మన తండ్రి. నూతన ప్రపంచ రచయిత. కనుక తప్పకుండా వారి నుండి మనకు స్వర్గ వారసత్వము లభించాలి. ఇప్పుడు 84 జన్మలు అనుభవించి మనము నరకంలో వచ్చి పడ్డాము. పిల్లలారా, భారతీయులైన మీరు సూర్య వంశీయులు, చంద్ర వంశీయులుగా ఉండేవారు, విశ్వాధికారులుగా ఉండేవారు. అప్పుడు ఏ ఇతర ధర్మము ఉండేది కాదు అని బాబా చెప్తారు. దానినే స్వర్గము లేక కృష్ణపురము అని అంటారు. ఇది కంసపురము. లక్ష్మీనారాయణుల రాజ్యము ఉండేదని బాప్‌దాదా గుర్తు చేయిస్తున్నారు. బాబాయే జ్ఞానసాగరులు, శాంతిసాగరులు, పతితపావనులు, నీటి గంగ కాదు. వధువులందరి వరుడు భగవంతుడు ఒక్కరే. ఇది మనుష్యులకు తెలియదు. అందుకే ఆత్మల తండ్రి ఎవరు? అని అడగండి. అప్పుడు తికమక పడ్తారు. మాకు తెలియదని అంటారు. అరే ఆత్మా! నీకు నీ తండ్రి గురించి తెలియదా? గాడ్‌ఫాదర్ అని అంటారు. తర్వాత వారి నామ-రూపాలు ఏవి? గాడ్‌ను గుర్తించగలరా? అని అడగాలి. దానికి వారు సర్వవ్యాపి అని చెప్తారు. అరే! పిల్లల తండ్రి ఎప్పుడైనా సర్వవ్యాపి అవ్వగలరా? రావణుని మతానుసారము ఎంత బుద్ధిహీనులుగా అయ్యారు! దేహాభిమానము మొదటి నెంబరుది. స్వయాన్ని ఆత్మ అని నిశ్చయము చేసుకోరు. నేను ఫలానా అని చెప్తారు. ఇది శరీరానికి సంబంధించిన విషయము. వాస్తవంగా "నేను ఎవరు?" అనే విషయము ఎవ్వరికీ తెలియదు. నేను న్యాయాధీశుడను(జడ్జిని), నేను ఫలానా... 'నేను', 'నేను' అని చెప్తూ ఉంటారు. కానీ ఇది తప్పు. నేను, నాది ఇవి రెండు పదాలు. ఆత్మ అవినాశి, శరీరము వినాశి. పేరు శరీరానికి ఉంటుంది. ఆత్మకు ఏ పేరు పెట్టబడదు. బాబా చెప్తారు - నా పేరు శివుడు. శివజయంతిని కూడా ఆచరిస్తారు. ఇప్పుడు నిరాకారుని జయంతి ఎలా ఉంటుంది? వారు ఎవరిలో వస్తారో ఇది ఎవ్వరికీ తెలియదు. ఆత్మలందరి పేరు ఆత్మనే, పరమాత్ముని పేరు శివుడు. మిగిలిన వారందరూ సాలిగ్రామాలు. ఆత్మలంతా పిల్లలు. ఒక్క శివుడే సర్వ ఆత్మలకు తండ్రి. వారు బేహద్(అనంతమైన) తండ్రి. మీరు వచ్చి మమ్ములను పావనంగా చేయండి, మేము దుఃఖితులుగా ఉన్నాము అని అందరూ పిలుస్తారు. ఆత్మనే పిలుస్తుంది. దుఃఖములో పిల్లలందరూ స్మృతి చేస్తారు. కానీ ఇదే పిల్లలు సుఖములో ఉన్నప్పుడు ఎవ్వరూ స్మృతి చేయరు. రావణుడు దుఃఖితులుగా చేశాడు.

ఈ రావణుడు మీ పాత శత్రువు అని బాబా అర్థము చేయించారు. ఇది కూడా డ్రామాలో రచింపబడింది. ఇప్పుడు అందరూ అంధకారంలో ఉన్నారు. అందుకే ఓ జ్ఞానసూర్యా రండి, మమ్ములను ప్రకాశములోకి తీసుకెళ్ళండి అని పిలుస్తారు. భారతదేశము సుఖధామంగా ఉన్నప్పుడు ఎవ్వరూ పిలిచేవారు కాదు. ప్రాప్తి కాని వస్తువు ఏదీ ఉండేది కాదు. ఇక్కడైతే ఓ శాంతిదేవా! అని అరుస్తూ ఉంటారు. బాబా వచ్చి - పిల్లలూ, శాంతి మీ స్వధర్మము, మీ

కంఠహారము, ఆత్మ శాంతిధామ నివాసి అని అర్థము చేయించారు. ఆత్మ శాంతిధామము నుండి మళ్ళీ సుఖధామానికి వెళ్తుంది. అక్కడ అపారమైన సుఖముంటుంది. మీరు అరవవలసిన అవసరము ఉండదు. దుఃఖములోనే అరుస్తూ పిలుస్తూ ఉంటారు. దయ చూపండి, ఓ దుఃఖహర్త-సుఖకర్త అయిన తండ్రీ! రండి అని పిలుస్తూ ఉంటారు. శివబాబా, మధురమైన తండ్రీ, మళ్ళీ రండి అని దుఃఖములోనే పిలుస్తారు. వారు తప్పకుండా వస్తారు అందుకే శివజయంతిని ఆచరిస్తారు. కృష్ణుడు స్వర్గములోని మొదటి రాకుమారుడు. వారి జయంతిని కూడా ఆచరిస్తారు. కాని కృష్ణుడు ఎప్పుడు వచ్చాడో ఎవ్వరికీ తెలియదు. రాధా-కృష్ణులే స్వయంవరం తర్వాత లక్ష్మీనారాయణులుగా అవుతారు. ఇది ఎవ్వరికీ తెలియదు. ఓ గాడ్‌ఫాదర్... అని మనుష్యులే పిలుస్తూ ఉంటారు. మంచిది వారి నామ-రూపాలు చెప్పమంటే నామ-రూపాలకు భిన్నమైనవారని చెప్తారు. అరే, గాడ్‌ఫాదర్ అని మీరంటారు, మరి నామ-రూపాలకు భిన్నమైనవారని ఎలా చెప్తారు? ఆకాశము శూన్యము, దానికి కూడా ఆకాశము అనే పేరుంది కదా. నామ-రూపాల గురించి మాకు తెలియదని అంటారు, మంచిది. కనీసము మీ గురించి మీకు తెలుసా? అని అడిగితే మేము ఆత్మలము అని అంటారు. మంచిది ఆత్మ నామ-రూపాలను చెప్పమని అడగండి. అప్పుడు ఆత్మనే పరమాత్మ అని అంటారు. ఆత్మ నామ-రూపాలకు అతీతముగా ఉండదు. ఆత్మ ఒక బిందువు నక్షత్రము వలె భృకుటి మధ్యలో ఉంటుంది. ఈ చిన్న ఆత్మలో 84 జన్మల పాత్ర నిండి ఉంది. ఇవి చాలా అర్థము చేసుకోవలసిన విషయాలు. కనుక 7 రోజుల భట్టీకి గాయనముంది. ద్వాపర యుగము నుండి రావణ రాజ్యము ప్రారంభమయ్యింది. అప్పటి నుండి వికారాలు ప్రవేశించాయి. మెట్లు దిగుతూ వచ్చారు. ఇప్పుడు అందరికీ గ్రహణము పట్టి నల్లగా(అపవిత్రంగా) అయిపోయారు. కనుక "జ్ఞానసూర్యా! రండి, వచ్చి మమ్ములను ప్రకాశములోనికి తీసుకుని వెళ్ళండి" అని పిలుస్తారు. జ్ఞాన అంజనము సద్గురువు ఇచ్చారు... అని అంటారు. జ్ఞాన అంజనము గురువు ఇచ్చారని అనలేదు - ఈ విషయము మీ బుద్ధిలో ఉంది. గురువులు అనేకమంది ఉన్నారు. వారిలో జ్ఞానము ఎక్కడుంది? వారికి గాయనము లేదు. జ్ఞానసాగరులు, పతితపావనుడు, సర్వుల సద్గతిదాత ఒక్క తండ్రి మాత్రమే. ఇతరులు జ్ఞానాన్ని ఎలా ఇవ్వగలరు? భగవంతుని చేరుటకు అనేక మార్గాలు ఉన్నాయని సాధువులు చెప్తారు. శాస్త్రాలు చదవడం, యజ్ఞాలు-తపాలు చేయడం - ఇవన్నీ భగవంతుని చేరే మార్గములని అంటారు. కానీ పతితులు పావన ప్రపంచములోనికి ఎలా వెళ్ళగలరు? నేను స్వయంగా వస్తానని తండ్రి చెప్తారు. భగవంతుడు ఒక్కరే, బ్రహ్మ-విష్ణు-శంకరులు కూడా దేవతలే. వారిని భగవంతుడు అని అనరు. వారి తండ్రి కూడా శివుడే. ప్రజాపిత బ్రహ్మ ఇక్కడే ఉంటారు కదా. ప్రజలు ఇక్కడ ఉన్నారు. ప్రజాపిత బ్రహ్మకుమారీల సంస్థ అని పేరు కూడా వ్రాయబడి ఉంది. కనుక మీరు పిల్లలయ్యారు కదా. అనేక మంది బి.కె.లున్నారు. ఆస్తి శివుని నుండి లభిస్తుంది, బ్రహ్మ నుండి లభించదు. ఆస్తి తాత

నుండి లభిస్తుంది. బ్రహ్మా ద్వారా స్వర్గానికి వెళ్లేందుకు యోగ్యులుగా తయారు చేస్తారు. బ్రహ్మా ద్వారా పిల్లలను దత్తు(దత్తత) తీసుకుంటారు. బాబా మేము మీ వారమే, మీ నుండి ఆస్తి తీసుకుంటామని పిల్లలు కూడా చెప్తారు. బ్రహ్మా ద్వారా విష్ణుపురి స్థాపనవుతుంది. శివబాబా రాజయోగాన్ని నేర్పిస్తారు. శ్రీమతము అనగా సర్వ శ్రేష్ఠమైనది అనగా శ్రేష్ఠమైన భగవంతుని గీత. భగవంతుడు ఒక్కరే. వారు నిరాకారులు. మీరు 84 జన్మలు తీసుకున్నారని తండ్రి అర్థము చేయిస్తారు. ఆత్మ-పరమాత్మలు చాలా కాలము వేరుగా ఉన్నారు... చాలా కాలము నుండి అయితే భారతవాసులే దూరంగా ఉన్నారు. అది ఏ ఇతర ధర్మమూ కాదు. ఈ ధర్మము వారే మొట్టమొదట దూరమయ్యారు. తండ్రి నుండి దూరమై ఇక్కడ పాత్రను అభినయించేందుకు వచ్చారు. ఓ ఆత్మలారా, ఇప్పుడు నన్ను స్మృతి చేయండి అని బాబా ఆత్మలకు చెప్తారు. ఇది స్మృతి యాత్ర లేక యోగ అగ్ని. మీ తల పై ఉన్న పాప భారము ఈ యోగాగ్నిలో భస్మమౌతుంది. ఓ మధురమైన పిల్లలారా, మీరు స్వర్ణిమ యుగము నుండి ఇనుప యుగంలోకి వచ్చారు. ఇప్పుడు నన్ను స్మృతి చేయండి. ఇది బుద్ధితో చేయు పని కదా. దేహ సహితం దేహ సర్వ సంబంధాలను వదిలి నన్ను ఒక్కరినే స్మృతి చేయండి. మీరు ఆత్మలు కదా. ఇది మీ శరీరము. 'నేను' - 'నేను' అని ఆత్మ చెప్తుంది. మిమ్ములను రావణుడు పతితులుగా చేశాడు. ఇది తయారైన డ్రామా. పావన భారతదేశము, పతిత భారతదేశము. ఎప్పుడు పతితమవుతారో అప్పుడు తండ్రిని పిలుస్తారు. రామరాజ్యం కావాలని కూడా అంటారు కాని దాని అర్థాన్ని తెలుసుకోలేరు. జ్ఞానాన్ని ఇచ్చే జ్ఞానసాగరుడు ఒక్క తండ్రి మాత్రమే. తండ్రే వచ్చి సెకండులో వారసత్వమునిస్తారు. బాబా నుండి సూర్యవంశీ, చంద్రవంశీ వారసత్వాన్ని తీసుకునేందుకు ఇప్పుడు మీరు తండ్రివారిగా అయ్యారు. సత్య - త్రేతా యుగాలలో మీరు అమరులుగా అవుతారు. ఫలానావారు మరణించారని అక్కడ అనరు. సత్యయుగంలో అకాల మృత్యువుండదు. మీరు మృత్యువు పై విజయము పొందుతారు. దుఃఖము పేరే ఉండదు. దానిని సుఖధామమని అంటారు. నేను మీకు స్వర్గ సామ్రాజ్యాన్ని ఇస్తాను, అక్కడ చాలా వైభవాలుంటాయని తండ్రి చెప్తారు. భక్తిమార్గంలో మందిరాలను నిర్మించారు, ఆ సమయంలో కూడా ఎంత ధనముండేది. భారతదేశము ఎలా ఉండేది! మిగిలిన ఆత్మలందరూ నిరాకార ప్రపంచంలో ఉండేవారు. ఉన్నతాతి ఉన్నతమైన తండ్రి ఇప్పుడు స్వర్గ స్థాపన చేస్తున్నారని పిల్లలు అర్థం చేసుకున్నారు. ఉన్నతాతి ఉన్నతమైనవారు శివబాబా తర్వాత సూక్ష్మ వతనవాసులైన బ్రహ్మా-విష్ణు-శంకరులు, తర్వాత ఈ ప్రపంచము.

జ్ఞానము ద్వారానే పిల్లలైన మీకు సద్గతి కలుగుతుంది. జ్ఞానము, భక్తి, వైరాగ్యము అని మహిమ కూడా చేయబడ్తుంది. పాత ప్రపంచము పై వైరాగ్యము వస్తుంది, ఎందుకంటే సత్యయుగ సామ్రాజ్యము లభిస్తుంది. పిల్లలారా, నన్నొక్కరినే స్మృతి చేయండి. నన్ను స్మృతి చేస్తూ మీరు నా వద్దకు వచ్చేస్తారు అని ఇప్పుడు తండ్రి చెప్తున్నారు. మంచిది.

మధురాతి మధురమైన అపురూపమైన పిల్లలకు మాత - పిత, బాప్‌దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్‌మార్నింగ్
ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము :-

1. తల పై ఉన్న పాప భారాన్ని యోగాగ్ని ద్వారా భస్మము చేసుకోవాలి. బుద్ధి ద్వారా దేహ సహితంగా సర్వ సంబంధాలను వదలి ఒక్క తండ్రిని మాత్రమే స్మృతి చేయాలి.
2. పిలవడం లేక అరవడానికి బదులుగా మీ శాంతి స్వధర్మములో స్థితులవ్వాలి, శాంతి మీ కంఠహారము. దేహాభిమానములోకి వచ్చి నేను, నాది అను శబ్దాలను ఉపయోగించరాదు. స్వయాన్ని ఆత్మ అని నిశ్చయము చేసుకోవాలి.

వరదానము :- " తమ శ్రేష్ఠ స్థితి ద్వారా మాయను మీ ముందు విధేయునిగా చేసుకునే అత్యంత ఉన్నతమైన పదవికి అధికారి భవ."

ఎలాగైతే మహాన్ ఆత్మలు ఎప్పుడూ ఎవ్వరి ముందు తల వంచరో, వారి ముందు అందరూ తల వంచుతారో, అలా తండ్రి ద్వారా ఎన్నుకోబడిన సర్వ శ్రేష్ఠ ఆత్మలైన మీరు ఎక్కడున్నా ఎటువంటి పరిస్థితులలో ఉన్నా రకరకాల మాయవి ఆకర్షణలకు స్వయం తల వంచలేరు, విధేయులుగా అవ్వలేరు. ఎప్పుడైతే ఇప్పటి నుండి సదా వంచుకునే(విధేయులుగా) స్థితిలో స్థితమై ఉంటారో అప్పుడు అత్యంత ఉన్నత(హైయెస్ట్) పదవికి అధికారం ప్రాప్తిస్తుంది. ఇటువంటి ఆత్మల ముందు సత్యయుగంలోని ప్రజలు స్వమానంతో విధేయులుగా అవుతారు లేక తల వంచుతారు, ద్వాపర యుగంలో మీ స్మృతి-చిహ్నాల ముందు భక్తులు తల వంచుతూ విధేయులుగా ఉంటారు.

స్లోగన్ :- " కర్మలు చేసే సమయంలో యోగం యొక్క బ్యాలన్స్ సరిగ్గా ఉంటే వారిని కర్మయోగులని అంటారు "